కెరటం
( సామాన్యుడి ఆయుధం )
న్యూస్
సోమవారం 15, జూలై 2024 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ

# పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

- గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినా.. మేం రోగులను ఆదుకుంటున్నాం
- ఎల్ఓసిల ద్వారా 120మందికి పైగా రూ.కోటి వరకు అందజేత
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో 132 మందికి రూ.32.66లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



కూసుమంచి, కెరటం న్యూస్ ప్రతినిధి

పేదల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి లోని తన క్యాంప్ కార్యాలయంలో పాలేరు నియోజకవర్గం నాలుగు మండలాల పరిధిలోని 132 మందికి రూ.32,66,500 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ మిగతా 2లో..

## ఘనంగా జగ దాంబికా గోల్కొండ ఎల్లమ్మ 50వ వార్షిక బోనాల స్వర్ణోత్సవాలు

4వ పేజీలో..



## నూతన చట్టాలతో ప్రమాదంలో భావ వ్యక్తీకరణ

- బాధితులనే బాధించే అవకాశం
- కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం
- నూతన చట్టాలు - సమాజంపై ప్రభావం
- సెమినార్ లో సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ రెడ్డి

3





## ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన డా.మట్టా దయానంద్

3




రైతులు ఆదాయం లేక సాగు నుంచి వైదొలుగుతున్న నేపథ్యంలో...

## పథకాలలో కోత మరింత నష్టం



5వ పేజీలో..

## గృహజ్యోతి పథక దరఖాస్తుదారులకు సవరణలకు అవకాశం



మధిర కెరటం న్యూస్ ప్రతినిధి: ప్రజా పాలన లో గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకున్న 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులు కొన్ని ఆన్లైన్ పొరపాట్ల వలన ఇప్పటివరకు గృహ జ్యోతి పథకం ద్వారా లబ్ది పొందనట్లయితే మధిర మున్సిపాలిటీ మధిర, ఎర్రుపాలెం మండల ఆఫీసుల నందు ఏర్పాటు కాబడిన ప్రజాపాలన కేంద్రాల ద్వారా మీ యొక్క సర్వీస్ నెంబర్ సరి చేయించుకొ నవచ్చును. అదేవిధంగా మీ సర్వీస్ నెంబర్ కు రేషన్ కార్డుని అనుసంధానించు కొనుట అద్దె ఇంట్లో ఉండే విద్యుత్ వినియోగదారులు మరియొక ఇంటికి మారినప్పుడు ఆ ఇంటి సర్వీసు నెంబర్ కనెక్షన్ తో అనుసంధానం చేసుకొని, గృహ జ్యోతి పథకం కింద జీరో బిల్లు పొందవలసినదిగా మధిర విద్యుత్ శాఖ సబ్ డివిజన్ ఏడిఈ ఎం. అనురాధ తెలియజేస్తున్నారు.

## మధిరలో కుక్కలు బాబోయ్ కుక్కలు

- మధిరలో కుక్కలు (పిచ్చికుక్కల) స్వైరవిహారం
- భయపడుతున్న ప్రజలు



మధిర కెరటం న్యూస్ ప్రతినిధి: మధిర పట్టణంలో పిచ్చికు క్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ఒంటరి గా కనిపిస్తే చాలు మీద పడి దాడి చేస్తున్నాయి. గత కొద్దిరోజుల క్రితం పట్టణంలోని ఆజాద్ రోడ్లో నివాసముండే వ్యక్తి పైన కుక్కల (పిచ్చి కుక్కల) దాడి చేసి గాయపరిచినాయి. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులో కుక్కలు పెద్దలను, పిల్లలను భయపెడుతున్నాయి. పిల్లలు వీధిలోకి వచ్చి ఆడుకోవాలి అంటే ఎప్పుడూ ఏ కుక్క కరుస్తుందనే భయపడే పరిస్థితి నెలకొంది ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి పెట్టి కేవలం మాటలకే కాకుండా చేతలతో పని చేసి శాశ్వత పరిష్కారం జరిగేలా చూడాలని మధిర ప్రజలు కోరుతున్నారు.

## గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ తప్పక పాటించాలి



ఖమ్మం టౌన్, కెరటం న్యూస్: ఖమ్మం నగరంలో బంజారా భవన్ నందు ఏఐఎస్టీఈఏ జిల్లా నాయకులు గరిక శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం సమావేశానికి ముఖ్యఅతిథిగా అఖిలభారత గిరిజన ఉద్యోగుల జాతీయ అధ్యక్షులు పి.వి.రమణ పాల్గొని మాట్లాడారు . గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అన్ని శాఖలు తప్పక పాటించాలని , తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ కన్వర్ట్ పాఠశాలలో టీచర్ పోస్టులు మంజూరు చేయాలని అలాగే తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు గిరిజనులకు పది శాతం రిజర్వేషన్న తప్పక పాటించాలని ఖమ్మం జిల్లాలోని గిరిజన ఆశ్రమ కన్వర్ట్ పాఠశాలకు పోస్టులు మంజూరు చేయాలని , డైలీ వేజ్ వర్కర్లను , సిఆర్టి లను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు . ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు గిరిజన జిల్లా కార్యదర్శి భూక్య.వీరభద్రం , ఏకలవ్య సంఘం జిల్లా అధ్యక్షులు పుట్టబంతి.బాలస్వామి , గోరు బంజరు రాష్ట్ర అధ్యక్షులు బుక్య.శోభన్ , ఏకలవ్య రాష్ట్ర నాయకులు శ్రీ రామ ప్రసాద్ , ఏఐఎస్టీఈఏ జిల్లా నాయకులు డాక్టర్ శంకర్ , నల్లగొండ.శివ కోటి , పుట్టబంతి.శ్రీను , జరుపుల వీరన్న , మొగిలి. శ్రీనివాస్, మొగిలి. రఘు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

(మొదటిపేజీ తరువాయి..)



చెక్కులను క్యాంపు కార్యాలయం ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి ఆదివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరపున బాధ్యతగా నేరుగా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రోగులకు కనీసం సీఎంఆర్ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని అన్నారు. మన ప్రభుత్వం వచ్చాక .. పెండింగ్ వాటిని కూడా మంజూరు చేశామని అన్నారు. ఇంకా మెరుగైన చికిత్స కోసం పాలేరు నియోజకవర్గంతో పాటు ఇతర నియోజక వర్గాలకు చెందిన 120 మందికి పైగా అనారోగ్య బాధితులకు ఎల్ వోసీల ద్వారా రూ. కోటికి పైగా ఇప్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో..: కాంగ్రెస్ మండలాధ్యకులు కళ్లెం వెంకటరెడ్డి, బెల్లం శ్రీను, మట్టే గురవయ్య, కూసుమంచి ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, కొప్పుల అశోక్, నాయకులు తమ్మినేని నవీన్, బజ్జూరి వెంకట రెడ్డి, మదాసు ఉపేందర్, హఫీజుద్దీన్,మద్ది మల్లారెడ్డి, భుజంగ రెడ్డి, భీష్మాచారి, పెంద్ర అంజయ్య, రామిరెడ్డి, నాగేశ్వరరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బూర్జువా, కమ్యూనిస్టు రాజకీయాలపై ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావాలి

- సిపిఎం పోతినేని సుదర్శన్ రావు



మధిర కెరటం న్యూస్ ప్రతినిధి : బూర్జువా, కమ్యూనిస్టు రాజకీయాలపై ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అన్నారు. మధిర మండల పరిధిలోని దెందుకూరు శ్రీరస్తు ఫంక్షన్ హాలు నందు సిపిఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభ సూచికంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు సిపిఎం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజకీయ శిక్షణ తరగతులను పోతినేని సుదర్శన్ రావు ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి వరకు సిపిఎం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తుందన్నారు. ఈ రాజకీయ శిక్షణా తరగతులలో ప్రస్తుత రాజకీయ పరిణామాలపై అవగాహన కల్పించేందుకే ఈ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రాజకీయ శిక్షణ తరగతుల వలన దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. ప్రస్తుతం, వర్తమాన రాజకీయాలపై అవగాహన లేకుండా కమ్యూనిస్టు రాజకీయాలు చేయలేమన్నారు. రాజకీయ సిద్ధాంతం లేకుండా కమ్యూనిస్టులు ముందుకు పోలేరన్నారు. ఇటీవల జరిగిన లోకసభ, శాసనసభ ఎన్నికలలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయన్నారు. ఆ పరిణామాలపై కమ్యూనిస్టు కార్యకర్తలు పూర్తి అవగాహన కలిగి ఉండకపోతే కమ్యూనిస్టుగా మనకు నష్టం జరుగుతుందన్నారు. ఈ రెండు ఎన్నికలలో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ఒక ప్రధానమైన శక్తిగా ఎదిగిందన్నారు. ఎవరు ఊహించని విధంగా ఎనిమిది పార్లమెంటు స్థానాలను గెలిచిందన్నారు. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో అనేక అనూహ్య రాజకీయ పరిణామాలు వేగంగా ముందుకు వెళు తున్నాయన్నారు. బూర్జువా రాజకీయాలు రాష్ట్ర ప్రజలకు నష్టం కలిగిస్తాయన్నారు. కమ్యూనిస్టు రాజకీయాలు ప్రజలకు మేలు చేస్తాయన్నారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు హాజరైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, భవిష్యత్తు పోరాటాలకు పునాది వేసుకోవడానికి ఈ రాజకీయ శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఈ రాజకీయ శిక్షణ తరగతుల వల్ల కమ్యూనిస్టు అనే వ్యక్తికి రాజకీయంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. మిగతా బూర్జువా రాజకీయ పార్టీలకు అధికారం తప్ప ప్రజా ప్రయోజనాలు పట్టవన్నారు. దేశవ్యాప్తంగా బిజెపి మతోన్మాద విధానాలతో ముందుకు సాగుతుందని, ఇది దేశ ప్రయోజనాలకు ప్రమాదకరమన్నారు. ఈ ప్రమాదం గురించి ప్రజలలో రాజకీయ చైతన్యం తీసుకురావాల్సిన అవసరం కమ్యూనిస్టులపైనే ఉందన్నారు. ఈ శిక్షణ తరగతులలో సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, బొంతు రాంబాబు, బుక్య వీరభద్రం, యనమదల విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు మన్నేపల్లి సుబ్బారావు జిల్లా ఎకడమిక్ సెల్ సభ్యులు బండారు రమేష్ మధిర మండల నాయకులు శీలం నరసింహారావు, మంద సైదులు, మండవ ఫణీంద్ర కుమారి, అనుమోలు భాస్కరరావు, పాపినేని రామ నరసయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల ఫ్రాక్షన్ కమిటీ సభ్యులు, శాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన చట్టాలతో ప్రమాదంలో భావ వ్యక్తీకరణ

- బాధితులనే బాధించే అవకాశం
- కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం
- నూతన చట్టాలు - సమాజంపై ప్రభావం
- సెమినార్‌లో సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ రెడ్డి




**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్:** కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన చట్టాలతో భావ వ్యక్తీకరణకు ప్రమాదం ఏర్పడిందని ప్రశ్నించే తత్వాన్ని చంపేసే విధంగా చట్టాలు రూపొందించబడ్డాయని సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. కొన్ని కేసుల్లో పోలీసులకు విస్తృత అధికారం కల్పించడం సహేతుకం కాదన్నారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నూతన చట్టాలు సమాజంపై ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సెమినార్లో విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ గత చట్టాలు బ్రిటీష్ పాలనలో రూపొందించబడ్డాయని నూతన చట్టాల రూపకల్పన పై దృష్టిసారించిన ప్రభుత్వం కులంకుషంగా చర్చించకుండానే చట్టాల అమలుకు పూనుకుందని కేవలం 43గంటల 23 సెకన్లు మాత్రమే చర్చించారని ఆయన తెలిపారు. పేరు బ్రిటీష్ చట్టాలదే అయినా చట్టాల మార్పు వెనక బిజెపి మార్క్ దాగి ఉందని 10 శాతం గతంలో ఉన్న భారతీయ శిక్షాస్మృతిని మార్చి భారతీయ న్యాయ సంహితను తీసుకు వచ్చారని ఇందులో సాంకేతికత పరిజ్ఞానానికి ప్రాధాన్యత నివ్వడంతో కేసుల్లో పారదర్శకత లోపిస్తుం దని ఆయన తెలిపారు. ఏ తప్పుకు ఏ శిక్ష అన్నది భారతీయ శిక్షాస్మృతి ప్రకారమే తీసుకుని భారతీయ న్యాయ సంహిత భారతీయ నాగరిక్ సురక్ష సంహిత భారతీయ సాక్ష్యా సంహిత చట్టాలను తీసుకు వచ్చారని విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. పార్లమెంటులో విపక్షాన్ని బయటకు పంపి 20 డిసెంబరు 2023న పార్లమెంటులో 21 డిసెంబరు 2023న రాజ్యసభలో ఆమోదం పొంది 25 డిసెంబరు 2023న గెజిట్ గా రూపొందించబడిందని ఆయన తెలిపారు. ఈ చట్టాల అమలు వల్ల దుష్పరిణామాలను పరిగణలోకి తీసుకో లేదని ఐపిసిలో 511 సెక్షన్లు ఉంటే భారతీయ న్యాయ సంహితతో 358కి కుదించారని ఆయన తెలిపారు. 124 ఎ సెక్షన్లో గతంలో ఉన్న రాజ ద్రోహం స్థానే దేశ ద్రోహం చట్టాన్ని తీసుకు వచ్చారని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన తెలిపారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని 163వ సెక్షన్ సోషల్ మీడియాలో ఈ దేశానికి వ్యతిరేకంగా మాట్లాడినా, ప్రచారం నిర్వహించినా దేశ ద్రోహం కేసు నమోదు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కొన్నింటిలో పోలీసుల జోక్యాన్ని తగ్గించారని ముఖ్యంగా తూనికలు, కొలతలకు సంబంధించి గతంలో పోలీసులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేసే వారని కానీ ఇప్పుడు పోలీసులకు అవకాశం లేదని కేవలం ఆ శాఖాధికారులు మాత్రమే తనిఖీలు నిర్వహించనున్నారని తెలిపారు. కొన్ని చట్టాలను కఠినతరం చేశారని గతంలో సాధారణ శిక్షల స్థానే ఇప్పుడు జీవితకాల ఖైదు, మరణ శిక్షను సైతం విధించేవిధంగా చట్టాలను రూపొందించార న్నారు. ఇప్పుడు 16 ఏళ్ల లోపు బాలికపై అత్యాచారం జరిగితే కనీసం 20 ఏళ్లు శిక్షపడే అవకాశం ఉందన్నారు. గతంలో జీవిత ఖైదు అంటే కొన్నేళ్లకు పరిమితమయ్యే దని కానీ ఇప్పుడు సహజ సిద్ధమైన జీవితం ఉన్నంత కాలం ఖైదు విధించే అవకాశం ఉందన్నారు. నూతన చట్టాలు ఒకటి జూలై 2024 నుంచి అమల్లోకి వచ్చిన గతంలో ఐపిసి ప్రకారం నమోదైన కేసులను ఆ సెక్షన్ల ద్వారానే విచారిస్తారని పాత కేసులు పూర్తయ్యే వరకు కొత్త, పాత చట్టాలతో పని చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఫోక్సో లాంటి కేసుల్లో బాధితురాలి పేరును కానీ, కుటుంబ పేరును కానీ విచారణ పూర్తయ్యే త వరకు బహిర్గత పర్చరాదని పోలీసులు సైతం వివరాలు సీల్డ్ కవర్లో న్యాయమూర్తికి అందించి పేరుకు బదులు బాధితురాలి పేరును వాడాల్సి ఉంటుందని విద్యా సాగర్ రెడ్డి సూచించారు. మీడియా సైతం బాధితురాలి పేరును ఉచ్చరిస్తే శిక్షించే అవకాశం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలకు సంబంధించి గతంలో ఉన్న చట్టాలను ఇప్పుడు తీవ్రతరం చేశారని ఢీకొట్టి పారిపోవడం లాంటివి చేస్తే పదేళ్ల వరకు శిక్ష ఉండే అవకాశం ఉందని నాన్బెయిలబుల్ కేసులు 102 (2) బిఎన్ఎస్ ప్రకారం నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయవచ్చునన్నారు. ప్రభుత్వాల పట్ల కానీ, ప్రజాప్రతినిధుల పట్ల కానీ దురుసుగా ప్రవర్తించడం, అడ్డుకోవడం లేదా బెదిరింపులకు పాల్పడడం ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడం లాంటి వాటిని నేరాలుగా పరిగణించి ప్రస్తుత నూతన చట్టాలలో శిక్షను ఖరారు చేశారని ఆయన తెలిపారు. కొన్ని సెక్షన్లలో పోలీసులకు విపరీతమైన అధికారాలు ఇచ్చారని గతంలో రెవెన్యూ అనుమతితో కూడిన చట్టాలు అమలయ్యే అవకాశం ఉండగా ఇప్పుడు పోలీసులే నేరుగా చట్టాన్ని అమలు చేసే అవకాశం ఉందని విద్యాసాగర్ రెడ్డి తెలిపారు. ఇది ప్రశ్నించే గొంతుకలను నొక్కేయడమేనన్నారు. గతంలో హత్యాయత్నం కేసుకు సంబంధించి నేరం జరిగిన తీరును బట్టి జీవిత ఖైదు లేదా పదేళ్ల శిక్ష పడే అవకాశం ఉందన్నారు. అన్నింటికి మించి మోడీ, అమిత్ షాలను మాత్రమే సంప్రదించి ఈ చట్టాలను అమలు చేశారని ఇందులో న్యాయ నిపుణులను కానీ బార్ కౌన్సిల్ను కానీ పరిగణలోకి తీసుకోలేదన్నారు. కలెక్టర్ కొన్ని కేసులకు సంబంధించి స్పెషల్ ఎగ్జిక్యూటీవ్ మేజిస్ట్రేట్ను నియమించే అవకాశం ఉందని ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఇది అధికార దుర్వినియోగానికి అవకాశం ఇస్తుందని ఆయన తెలిపారు. భారతీయ సాక్ష్యా సంహితలో సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన సాక్ష్యాలను పరిగణలోకి తీసుకుంటున్నారని మారిన పరిస్థితుల్లో ఇది దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని మార్ఫింగ్ జరగడం ద్వారా నిందితులు తప్పించుకోవడం లేదా నేరస్తులు కానీ వారిని నేరస్తులుగా నిరూపించేఅవకాశం ఉందని విద్యాసాగర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మహిళలపై దాడులకు సంబంధించి పోలీసులు అప్పటికప్పుడు ఎఫ్ ఐఆర్ చేయకుండా 14 రోజుల పాటు కాలయాపన ను ఉన్నతాధికారి అనుమతితో చేసే అవకాశం ఉందని దీని వల్ల కొన్ని సందర్భాలలో కేసులు తారుమారు అయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు. గతంలో ఓ కేసు నమోదైనప్పుడు అప్పుడు బాధ్యతల్లో ఉన్న అధికారి మాత్రమే కోర్టుకు వచ్చి సాక్ష్యం చెప్పాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు ఆ స్థానంలో వచ్చిన అధికారులు ఎవరైనా సాక్ష్యం చెప్పే వెసులుబాటు కల్పించారని దీని వల్ల తీర్పుల్లో న్యాయం జరగక పోవచ్చునని ఆయన అన్నారు. ఈ సెమినార్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి. యర్రాబాబు, ఎస్కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, కో ఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కనకం జనార్ధన్, ఐఎఎల్ నాయకులు పట్టాభి, ఎస్ కె లతీఫ్, ఒరుగంటి శేషగిరిరావు, ఎడ్యుకేషన్ సబ్ కమిటీ సభ్యులు శింగు నర్సింహారావు, ప్రముఖ న్యాయవాది ఎన్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

- మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి



**ఖమ్మం రూరల్, కెరటం న్యూస్:** వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకులు అంబటి సుబ్బారావు, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అంబటి ఈశ్వర్ ఆధ్వర్యంలో అక్కడి వృద్ధులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా దయాకర్ రెడ్డి హాజరయ్యారు. టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలతో పాటు నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెంది, అనారోగ్యానికి గురిచేస్తాయన్నారు. కావున వాటిని తొలగించడంతో పాటు ఇంటి పరిశర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ, వైద్యశాఖలు నిత్యం గ్రామాల్లో పర్యటించి, ప్రజలను చైతన్య పరచడంతో పాటు వారి సేవలను అందించాలని సూచించారు. దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన తండ్రి,కుమారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కర్లపూడి వెంకటేశ్వర్లు, సప్పిడి ప్రభాకర్, పోతుల ప్రసాద్, సలవది రాజేష్, గొడ్డుగొర్ల గురవయ్య, షేక్ నాగులమీరా, అంబటి ఉపేందర్, షేక్ చాంద్ పాషా, షేక్ మస్తాన్, షేక్ తాగూర్, పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్ ను తనిఖీ చేసిన డా.మట్టా దయానంద్



**సత్తుపల్లి, కెరటం న్యూస్:** సత్తుపల్లి ప్రభుత్వ షెడ్యూల్ కులముల ఎస్సీ వసతి గృహంను డాక్టర్ మట్టా దయానంద్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఆదివారం సత్తుపల్లి పట్టణంలోని ఎస్సీ హాస్టల్ తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్ కులముల బాలుర వసతి గృహం లో ఆకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ హాస్టల్ బాలురను కలుసుకొని స్వయంగా చిన్నారులకు అందుతున్న భోజనం మరియు వసతి ఏర్పాట్ల సదుపాయాలును అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలురలకు మధ్యాహ్నం వండిన భోజనాలను స్వయంగా పరిశీలించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజాల రాణి, డాక్టర్ మట్టా దయానంద్ నిర్వహించిన తనిఖీల్లో హాస్టల్ హాజరు రిజిస్టర్ లో వసతి గృహ హాస్టల్ "కుక్ కనకారావు నిర్లక్ష్య వైఖరి బయటపడింది" నాలుగు రోజులు గా రిజిస్టర్ లో సంతకం కూడా లేని పరిస్థితి అధికారులు కు తెలియజేసిన డాక్టర్ మట్టా దయానంద్ వారంలో కేవలం 3 రోజులు మాత్రమే హాస్టల్ లో అందుబాటులో ఉంటున్న కుక్ కనకారావు. హాస్టల్ కుక్ కనకారావు వృత్తి పట్ల నిర్లక్ష్య వైఖరిని సంబంధిత అధికారులు కు ఆధారాలుతో తెలియజేసారు.

### రైతులు ఆదాయం లేక సాగు నుంచి వైదొలుగుతున్న నేపథ్యంలో...

# పథకాలలో కోత మరింత నష్టం

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్
- రైతు భరోసా తక్షణమే విడుదల చేయాలి
- మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి
- గడువు లేకుండా రైతు రుణమాఫీ చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



**చింతకాని, కెరటం న్యూస్ ప్రతినిధి:** వ్యవసాయంలో సరైన ఆదాయం లేక సాగు నుంచి వైదొలుగుతున్న నేపథ్యంలో రైతులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అరకొర సహాయంలో కోత విధిస్తే మరింత నష్టం జరిగిందని, రాష్ట్రంలో సాగు లో 40 శాతం గా ఉన్న కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు లభించడం లేదు అని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి తీగల సాగర్ అన్నారు. ఆదివారం చింతకాని మండలం కొదుమూరు గ్రామం లో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాగర్ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అని అన్నారు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా మార్కెట్లో లభించడం లేదని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు మేరకు మద్దతు ధరలు నిర్ణయం చేసి పార్లమెంటు చట్టం చేసి గ్యారంటీ ఇవ్వాల్సి అవసరం ఉందని అన్నారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ కమిటీ సభ్యులు, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ గత రబీ సీజన్లో వర్షాలు కురవక ప్రాజెక్టుల్లో నీరు లేక సాగు చేయలేదని ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ముమ్మరం గా సాగుతున్న సమయంలోనే రైతు భరోసా విడుదల చేసి రైతుల వ్యవసాయ అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత అందించాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో రైతుల సమస్యలు పరిష్కారం కోసం రాష్ట్ర మంత్రులు ప్రత్యేక సమావేశం రైతు సంఘాలు, రైతు ప్రతినిధులతో నిర్వహించాలి కోరారు, ఖమ్మం జిల్లా లో గత రెండు సార్లు రుణమాఫీ నోచుకోని రైతులకు గడువు తో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలి అని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, జిల్లా సహాయ కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, శీలం పకిరమ్మ, బిక్కసాని గంగాధర్ జిల్లా కమిటీ సభ్యులు రావుల రాజబాబు కొల్లేటి ఉపేందర్ మల్లెంపాటి రామారావు, బిగి రమేష్, తుమ్మూరు నాగేశ్వరరావు, కొమ్మినేని నాగేశ్వరరావు,మల్లెల సన్మధరావు, శీలం సత్యనారాయణ రెడ్డి, కళ్యాణం కృష్ణయ్య, చెరకు మల్లి కుటుంబ రావు,కుసుపూడి మధు సంక్రాంతి నర్సయ్య,, తోటకూర వెంకట నరసయ్య, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మొదలైన యూత్ కాంగ్రెస్ ఎన్నికల ప్రక్రియ

- వివరాలు తెలిపిన ఎన్నికల నిర్వహణ అధికారి కపిల్ దామోదర్

**కొత్తగూడెం,జూలై14 ( కెరటం ప్రతినిధి)** ఏఐసీసీ అగ్ర నాయకులు పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ఆలోచనల ప్రతిరూపం కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి, యువజన విభాగాలని వాటిని ప్రజాస్వామ్య ఎన్నికల పద్దతిలో నిర్వహించటం జరుగుతుందని యువజన కాంగ్రెస్ జోనల్ రిటర్నింగ్ అధికారి కపిల్ దామోదర్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువత యువజన కాంగ్రెస్ నాయకులను 3 వ సారి ఎన్నుకునే ప్రక్రియ మొదలయ్యిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2015, 2020 సంవత్సరాల్లో రాష్ట్ర, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిల్లో యువజన కాంగ్రెస్ నాయకులను ఎన్నికల పద్దతిలో ఎన్నుకోవడం జరిగిందని, మళ్ళీ ఇప్పుడు 2024లో మూడవ సారి రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాకమిటీలకు, 119 అసెంబ్లీ నియోజకవర్గ కమిటీలకు, 600 మండల కమిటీలకు,140 పట్టణ కమిటీలకు యువజన కాంగ్రెస్ నాయకులను ఎన్నికల ద్వారా ఏంపికచేసే విధానానికి యువజన కాంగ్రెస్ ఎలక్షన్ కమిషన్ నోటోఫికేషన్ విడుదల చెసిందని ఆయన తెలిపారు.

**ప్రస్తుత యువజన కాంగ్రెస్ ఎన్నికల విధి-విధానాలు**

రాష్ట్ర స్థాయి కమిటిలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షునితో పాటు 8 మంది ఉపాధ్యక్షులు, 48 మంది ప్రధాన కార్యదర్శులు జిల్లా స్థాయి కమిటిలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షునితో పాటు 6 గురు ఉపాధ్యక్షులు, 20 మంది ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి కమిటిలో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షునితో పాటు 6 గురు ఉపాధ్యక్షులు, 20 మంది ప్రధాన కార్యదర్శులు, మండల స్థాయి కమిటిలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షునితో పాటు 6 గురు ఉపాధ్యక్షులు, 10 మంది ప్రధాన కార్యదర్శులు ఎన్నికల ద్వారా ఎన్నుకోబడుతారన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఎన్నికల ప్రక్రియ ద్వారా జిల్లా అధ్యక్షునితో పాటు 26 మందితో జిల్లా యువజన కాంగ్రెస్ కమిటినీ అలాగే జిల్లా లోని 5 నియోజకవర్గాలకు ప్రతి నియోజకవర్గంలో ఆయా నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు ప్రతి నియోజకవర్గంలో 26 మందితో నియోజకవర్గ యువజన కాంగ్రెస్ కమిటీలను, 23



మండలాలకు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు ప్రతి మండలానికి 16 మంది తో మండల యువజన కాంగ్రెస్ కమిటీల ఎన్నిక జరగబోతున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలనుండి 35 సంవత్సరాల వరకు వయసుగల యువత యువజన కాంగ్రెస్ మోబైల్ యాప్ With IYC ద్వారా Rs. 50 చెల్లించి మెంబర్‌గా చేరవచ్చని అట్టి ప్రతి సభ్యునికి రాష్ట్ర అధ్యక్షునికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి, జిల్లా అధ్యక్షునికి, జిల్లా ప్రధాన కార్యదర్శికి, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షునికి, మండల అధ్యక్షునికి ఓటు వేసే హక్కు కల్పించబడుతుందని అగస్ట్ 5 నుండి ప్రారంభమయి సెప్టెంబరు 5 వరకు యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు ప్రక్రియ ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఈ సమావేశంలో యువజన కాంగ్రెస్ జోనల్ రిటర్నింగ్ అధికారి కపిల్ దామోదర్, యువజన కాంగ్రెస్ జిల్లా ఎలెక్టెడ్ అధ్యక్షులు వెంకటేష్ గురిజాల, కొత్తగూడెం అసెంబ్లీ నియోజకవర్గ ఎలెక్టెడ్ అధ్యక్షులు గద్దం రాజశేఖర్, మాజీ ఎన్ఎస్ యూఐ అధ్యక్షులు ముక్తేవి గిరీష్, యువజన కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు వివరించారు.

### ఎంపీ వద్దిరాజు నివాసంలో

## మున్నూరుకాపు అపెక్స్ కౌన్సిల్ మీటింగ్



**హైదరాబాద్ బ్యూరో, కెరటం న్యూస్:** రాజ్యసభ సభ్యులు,మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో ఆదివారం సంఘం అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎంపీ రవిచంద్ర అధ్యక్షతన హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఆయన నివాసంలో సుమారు మూడు గంటల పాటు సంఘం ప్రముఖులు, కౌన్సిల్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తమ రావు, సభ్యులు రౌతు కనకయ్య,సీ.విఠల్, బొంతు రాంమోహన్, ఆకుల రజిత్, నాగేందర్, మరికల్ పోత సుధీర్ కుమార్, విష్ణు జగతి, ఆది విష్ణుమూర్తి, కొత్త లక్ష్మణ్, లవంగాల అనిల్, ఆవుల రామారావులు హాజరై పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియమావళి ప్రకారం కౌన్సిల్ ప్రతి నెల సమావేశం కావాలని, సంఘం కార్యకలాపాలను అపెక్స్ కౌన్సిల్ బై-లా అనుసరించి మరింత చురుగ్గా కొనసాగించాలని, గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పటిష్టపర్చాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. సంఘం కార్యక్రమాలు చట్టానికి లోబడే ఉండాలని కూడా తీర్మానించారు.

## గురుకుల పాఠశాలల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



**వైరా టౌన్, కెరటం న్యూస్:** గురుకులాల పాఠశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సొంత భవనాలు లేక సౌకర్యాలు సక్రమంగా లేక విద్యార్థులు పేద విద్యార్థులు అవస్థలు పడుతున్నా రని సమస్యల పరిష్కారానికి రాష్ట్ర మంత్రివర్గం గురుకు ల విద్య సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వైరా నియోజకవర్గం ఇన్చార్జి భూక్యా వీరభద్రం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వైరా మండలం పరిధిలోని రెబ్బవరం లో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను సిపిఎం మండల కార్యదర్శి తోట నాగేశ్వర రావు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు తుము సుధాకర్, ఎస్ఎఫ్ఐ వైరా డివిజన్ కార్యదర్శి కోట ప్రేమ్ తో కలిసి సందర్శించారు, 750 మంది బాలికలు ఉన్నా సొంత భవనం లేక సమస్యలు తాండ విస్తున్నాయని, సరిపోను మరుగుదొడ్లు లేదని, పురుగుల బియ్యం తో అన్నం పెడుతున్నారని బాలికలు ఆవేదన వ్యక్తం చేసినట్లు వారు తెలిపారు, తాగునీరు ఆర్.ఓ.ఆర్ వాటర్ ప్లాంట్ చెడిపోయే 6 నెలలు అవుతున్న ఇప్పటివరకు మరమ్మతులు చెపటలేదని, వెంటనే అధికారులు వాటర్ ప్లాంట్ బాగు చేసి విద్యార్థులకు మంచినీరు అందించాలని భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు.








# కసాయి డాక్టర్

## గూగుల్‌లో వెతికి మరీ భార్య, ఇద్దరు చిన్నారులను చంపిన కర్కశుడు

- అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నారని భార్య, ఇద్దరు కుమార్తెలను హతమార్చిన ఓ కసాయి డాక్టర్
- హత్య చేసి రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించిన క్రిమినల్
- సీపీ ఆదేశాలతో చాకచక్యంగా కేసును ఛేదించిన రఘునాథపాలెం సీఐ శ్రీహరి, ఎస్ఐ సురేష్
- నిందితుడు అరెస్ట్, డిమాండ్ కు తరలింపు
- విలేకరుల సమావేశంలో వెల్లడించిన ఏసీపీ రమణమూర్తి

**రఘునాథపాలెం, ఖమ్మం, కెరటం న్యూస్**

అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నారని ఏకంగా కట్టుకున్న భార్య, ఇద్దరు చిన్నారులను హతమార్చి తనలోని క్రూరత్వాన్ని ప్రదర్శించిన ఓ క్రిమినల్ వైద్యుని నిర్వాకం ఇది... అగ్నిసాక్షిగా కట్టుకున్న భార్యను, బంగారం లాంటి ఇద్దరు చిన్నారులను కర్కశంగా చంపి తను కేసునుండి తప్పించుకునేందుకు గాను పైకి ఏమీ తెలియనట్టుగా రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించాడు... క్రైం సినిమా రచయితలకు సైతం అందని మేథస్సును ఉపయోగించి ముగ్గురు చనిపోయిన తరువాత కారును చెట్టుకు ఢీకొట్టించి రోడ్డు ప్రమాదంలో తన భార్య, పిల్లలు చనిపోయారని నమ్మించే ప్రయత్నం చేశాడు. మానవత్వానికి, మానవ సంబంధాలను మట్టిలో కలిసిపోయేలా ఓ వైద్యుడు రాసిన ఈ మరణశాసనం యావత్ సమాజం సిగ్గుపడేలా చేసింది. ఘటన జరిగిన నాడే మృతురాలి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఈ నరరూప రాక్షసునిపై అనుమానించారు. ఇది ప్రమాదం కాదనీ, కచ్చితంగా ఇతనే చంపి ఉంటాడని పోలీసులకు, మీడియాకు మొరపెట్టుకున్నారు.. దీంతో అతనిపై కన్నేసిన పోలీసులు ఎట్టకేలకు నిజాన్ని వెలికి తీశారు. తనకు, తన ప్రియురాలికి అడ్డుగా ఉన్నారన్న కారణంతోనే తాను ఇద్దరు బిడ్డలను, భార్యను ఓ పథకం ప్రకారమే చంపినట్టు ఆ క్రిమినల్ డాక్టర్ ఒప్పుకోవడంతో ఆదివారం అతన్ని మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు ఈ దారుణ ఉదంతాన్ని వెల్లడించారు. సుమారు నెలన్నర కిందట జరిగిన ఈ ఘోర ఉదంతానికి సంబంధించి ఖమ్మం టౌన్ ఏసీపీ ఎస్.వి. రమణమూర్తి ఆదివారం రఘునాథ పాలెం ఎస్ఎస్ హెచ్ఎలో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

### డాక్టర్ రాసిన మరణ శాసనం...

తన అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నారని కట్టుకున్న భార్యను, రక్తం పంచుకుపుట్టిన ఇద్దరు చిన్నారులను కడతేర్చి, పైకి రోడ్డు ప్రమాదంలా చిత్రీకరించి అతిపెద్ద నేరం నుండి తప్పించుకోవాలన్న ప్రవీణ్ అనే కసాయి డాక్టర్ అసలు రూపాన్ని ఖమ్మం పోలీసులు బయటపెట్టారు. పోలీసులు జరిపిన విచారణలో విస్తుపోయే నిజాలు వెల్లడికాగా, అతిచాకచక్యంగా మర్డర్ స్కెచ్‌ను




ఛేధించారు. రఘునాథపాలెం మండలం బావోజి తండా గ్రామానికి చెందిన డాక్టర్ బోడా ప్రవీణ్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్టుగా, అనస్తీషియన్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య కుమారి, ఇద్దరు పిల్లలున్నారు. కాగా ప్రవీణ్ పనిచేసే అదే ఆస్పత్రిలో తనతో పాటు నర్సుగా పనిచేస్తున్న కేరళకు చెందిన సోనీ ఫ్రాన్సిస్ అనే యువతితో ఉన్న పరిచయంతో అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న భార్య కుమారి ప్రవీణ్ ను నిలదీసింది. విషయం భార్యకు తెలిసిపోయిందని భావించిన డా. ప్రవీణ్ ఇక తన భార్య బతికి ఉంటే ఇలాగే నిలదీస్తుందని అనుకుని కక్ష పెంచుకున్నాడు. తన అక్రమ సంబంధానికి అడ్డు లేకుండా భార్య, పిల్లలను హతమార్చాలని పన్నాగం పన్నాడు. ఈ క్రమంలోనే మొదటిగా వారిని చంపాలన్న పథకంతో గత మే నెల 17వ తేదీన హైదరాబాద్ నుంచి తన గ్రామానికి కారులో తన భార్య, పిల్లలను తీసుకొని వచ్చాడు. అదేరోజు హత్య చేయాలని అనుకున్నప్పటికీ అప్పుడున్న పరిస్థితుల్లో హత్య పథకం సాధ్యపడలేదు. తరువాత మళ్లీ అదే పథకంతో మే నెల 28న తనతో పాటు తెచ్చుకున్న డ్రగ్స్ తీసుకొని ఉదయం సుమారు పదిన్నర గంటల సమయంలో తన భార్య, పిల్లలతో సహా ఖమ్మం వచ్చాడు. ఖమ్మంలో పని చూసుకొని సాయంత్రం 4 గంటల తర్వాత తన భార్య, పిల్లలతో తన కారులో సొంతూరికి బయల్దేరాడు.

### హత్యా పథకానికి కలిసొచ్చిన భార్య అనారోగ్యం

డా.ప్రవీణ్ తన భార్య, పిల్లలతో ఇంటికెళ్లే సమయంలో భార్యకుమారి తనకు వేడి చేసిందని, ఇబ్బందిగా ఉందని చెప్పింది. వెళ్లే దారిలో జ్యూస్ తాగుదామని భార్య డాక్టర్ ప్రవీణ్ తో చెప్పింది. ఈ క్రమంలో అప్పటికే పథకం ప్రకారం వారిని చంపేందుకు తనతో తెచ్చుకున్న ఇంజక్షన్ ను భార్య ఇచ్చి చంపేందుకు మార్గం సుగగమైందని భావించాడు. వేడి తగ్గేందుకు తన దగ్గర ఇంజెక్షన్ ఉందని, అది తీసుకుంటే తగ్గి పోతుందని అమాయక కుమారితో నమ్మబలికాడు. తనకు వేడి చేసిందని చెప్పిన కుమారిని కారు వెనుక సీటులో పడుకోమని చెప్పి ఇదే అదనుగా భావించిన ప్రవీణ్ ఖమ్మం నుండి ఇల్లందుకు వెళ్లే దారిలో కారు కోయచెలక వైపు తీసుకెళ్లాడు. కోయచెలక దాటిన తర్వాత కొంత దూరంలో కారు ఆపి తన భార్యకు తను వెంట తెచ్చుకున్న ఇంజెక్షన్ తో పాటు అప్పటికే తన దగ్గర ఉన్న డ్రగ్‌ను చూపించి ఈ ఇంజక్షన్ చేస్తే తొందరగా రిలీఫ్ వస్తుందని నమ్మించాడు. అందుకు భార్య సరేననడంతో అధిక మో తాదులో తన భార్య కుడి చేతి మణికట్టుపైన ఐవీ ద్వారా ఇంజెక్షన్ ఇచ్చాడు. ఆ తర్వాత కొంత సేపటికి భార్య చనిపోయేంత వరకూ అక్కడే ఉన్నాడు. ఆ తరువాత తన రక్తం పంచుకు పుట్టిన ఇద్దరు కుమా ర్తెలు క్రుషిక, కృతికల నోరు మూసి ఊపిరి ఆడకుండా చేసి ఒకరి తర్వాత ఒకరిని కర్కశంగా హతమార్చాడు. అనంతరం కేసు తనపైకి రాకుండా ఉండేలా మరో మాస్టర్ ప్లాన్ వేశాడు. ముగ్గురిని హత్య చేసిన తరువాత వీరిది రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడు. బంధువులకు, పోలీసులకు, ఎవరికీ తనపై ఎలాంటి అనుమానం రాకుండా చేసి కేసును తప్పుదోవ పట్టించి తన పైకి రాకుండా ఉండాలని తన కారులో ముగ్గురి మృతదేహాలను తీసుకెళ్తూ రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ దాటిన తర్వాత ఎడమవైపుగా ఉన్న పొదల్లోకి తీసుకొని వెళ్లి కారును వేగంగా నడిపి చెట్టుకు బలంగా ఢీకొట్టాడు. క్రైం సినిమాలో సైతం లేని విధంగా అత్యంత పథకం ప్రకారం అనుకున్న పనిని పూర్తిచేసి ఏమీ తెలియనట్టుగా తనకు స్వల్ప గాయాలైనట్టుగా ఫిర్యాదుచేశాడు.

### గూగుల్‌లో వెతికి మరీ హత్య చేశాడు...

ఇది ముమ్మాటికీ హత్యేనని మృతురాలు కుమారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై సమగ్రంగా విచారించిన ఖమ్మం పోలీసులకు విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఖమ్మం టౌన్ ఏసీపీ ఎస్.వి. రమణ మూర్తి నేతృత్వంలో రఘునాథపాలెం సీఐ శ్రీహరి రెండు బృందాలుగా ఏర్పడి ఎట్టకేలకు కేసును ఛేదించారు. కేవలం ప్రియురాలికి, తనకు అడ్డుగా ఉన్నారన్న కారణంతోనే ముగ్గురినీ హతమార్చినట్టు ప్రవీణ్ ఒప్పుకోవడం సంచలంగా మారింది. కాగా భార్య కుమారికి డ్రగ్స్ ఇచ్చేందుకు ఏ మోతాదులో ఇస్తే ఎంత త్వరగా చనిపోతుందని ప్రవీణ్ గూగుల్ వెతికి మరీ హత్య చేసినట్టు పోలీసులు గుర్తించడం విశేషం. ఈ ఘాతుకాన్ని క్షుణ్ణంగా పరిశోధించిన పోలీసులు నిందితుడు డాక్టర్ ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు. దారుణ హత్యలను ప్రమాదంలా చిత్రీకరించిన డాక్టర్ ప్రవీణ్ కేసును రఘునాథపాలెం సీఐ శ్రీహరి తన పోలీస్ బృందం కేవలం 40 రోజుల్లో ఛేదించిన క్రమంలో ఖమ్మం సీపీ సునీల్ దత్ సీఐ శ్రీహరి, ఎస్ఐ సురేష్ లను ప్రత్యేకంగా అభినందించారు.